


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 30-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :13 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## చివరి నిమిషంలో సీఎం సభ రద్దు




మధిరలో సభకు బ్రేక్

హైదరాబాద్‌లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సాయంత్రం 4 గంటలకు ప్రారంభం

రైతు వేదికల ద్వారా వర్చువల్ పాల్గొనడం

## 30 వేల డూప్లికేట్ ఓట్లు?

## ఈసీని ప్రశ్నించిన కవిత




కొడంగల్‌లో 30 వేల డూప్లికేట్ ఓట్లు?

ఈసీపై కవిత తీవ్ర అనుమానాలు

బోధన్‌లో 7 వేల ఓట్లు తొలగింపు

కొడంగల్‌లో 808 ఓట్లే ఎందుకు?

**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌తో పాటు బోధన్ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు, చేర్పులపై ఆమె పలు సంచలన ఆరోపణలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొండగల్ నియోజకవర్గంలో దాదాపు 30 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాన్నాయని ఇందులో పొరుగున ఉన్న కర్ణాటకలోని సెడం నియోజకవర్గం నుంచి 11 వేల మంది కొడంగల్‌లో ఓటర్లుగా ఉన్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గం పరిధిలోనే 22 వేల డూప్లికేట్ ఓట్లు ఉంటే, 11 వేలు కర్ణాటక ఓటర్లు ఉన్నారని ఇక్కడ డూప్లీకేట్ ఓటర్లు ఎన్ని ఉన్నాయో అంతే మార్జిన్ తో రేవంత్ రెడ్డి గెలుపొందారన్నారు. అంటే సీఎంకు ఈసీ ఫేవర్ చేసిందా? దీనిపై మా అనుమానాలను ఈసీ నివృత్తి చేయాలన్నారు. బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

## సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ భయం పట్టుకుంది

### దమ్ముంటే అసెంబ్లీ రద్దు చెయ్




ఎత్తు వ్యాఖ్యలపై కౌంటర్

ప్రజా హామీలపై దృష్టి పెట్టాలని సూచన

అధికార మదంపై విమర్శలు

**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయినా నన్ను తిట్టనిదే ఆయనకు తెల్లారదు. నిద్రలో కూడా ఆయన బీఆర్ఎస్ పార్టీనే కలవరిస్తున్నారంటేనే ఆయనకు ఎంత భయం పట్టుకుందో అర్థమవుతోంది" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీష్ రావు ఎద్దేవా చేశారు. శారీరక ఎత్తుపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ రేవంత్ రెడ్డి సంకుచిత మనస్తత్వాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మళ్లీ మల్లికార్జున ఖర్గే

మరోసారి ప్రతిపక్ష నేతగా గుర్తింపు

కేంద్రం అధికారిక ఉత్తర్వులు

రాజ్యసభలో ఎంపీగా ప్రమాణం

సాంకేతిక కారణాలతో చిన్న విరామం

నోటిఫికేషన్ జారీ చేసిన సెక్రెటేరియట్

కాంగ్రెస్ నేతల్లో హర్షం




## ప్రాణం తీసిన సర్ భయం

### జైలుకు పంపిస్తారేమోనని వ్యక్తి ఆత్మహత్య!




## తమిళనాడులో కొనసాగుతున్న రాజీనామాల పర్వం

### మరో ఎమ్మెల్యే రాజీనామా

ఎం.ఆర్. విజయభాస్కర్ రాజీనామా

స్పీకర్‌కు లేఖ సమర్పణ

పళనిస్వామికి పెరుగుతున్న ఇబ్బందులు

టీవీకే వైపు ఎమ్మెల్యేల చూపు

రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ

2 లో




## మహాలక్ష్మితో మారిన ఆర్టీసీ దశ

**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. గత పదేళ్లుగా నష్టాల్లో చిక్కుకుని కొట్టుమిట్టాడిన ఆర్టీసీ మునుపెన్నడూ లేని విధంగా భారీ లాభాల బాట పట్టింది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో టీజీఎస్ఆర్టీసీ ఏకంగా రూ.1,059.2 కోట్ల వార్షిక మిగులును సాధించి.. చరిత్రలోనే అత్యధిక వార్షిక లాభాన్ని నమోదు చేసింది. ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరగడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలు, ప్రభుత్వ సకాలంలో నిధుల రీయింబర్స్‌మెంట్ చేయడం, సంస్థ తీసుకున్న ఖర్చుల నియంత్రణ చర్యలు ఈ చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన తాజా నివేదిక ప్రకారం.. టీజీఎస్ఆర్టీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) లోనూ ఇదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే ఏడాదికి రూ.1,118.8 కోట్ల మిగులు సంపాదనను లక్ష్యంగా పెట్టుకుంది.

మిగతాది 2 లో..

- కాసుల వర్షంలో టీజీఎస్ఆర్టీసీ
- చరిత్రలోనే అత్యధిక వార్షిక లాభం
- రికార్డు ఆదాయంతో కొత్త చరిత్ర
- ప్రభుత్వ సహకారంతో లాభాల జోరు
- ప్రయాణికులే లాభాలకు బలం
- ఆదాయంలో దూసుకెళ్తున్న ఆర్టీసీ
- లాభాల బాటలో మరో భారీ లక్ష్యం
- రూ.1,059 కోట్ల లాభాలు

## రాష్ట్రంలో నేరాల రేటు 14% తగ్గింది: హోంమంత్రి అనిత

డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యం

గంజాయి సాగు సున్నాకు చేరింది

'ఈగల్' టాస్క్‌ఫోర్స్ ఘన ఫలితాలు

1.20 లక్షల కేజీల గంజాయి ధ్వంసం

రూ.24 కోట్ల ఆస్తుల జప్తు

మత్తు మాఫియాపై మరింత కఠిన చర్యలు

**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ దిశగా ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి సాగును రికార్డు స్థాయిలో సున్నాకు చేర్చగలిగామని, దీనివల్లనే రాష్ట్రంలో నేరాల రేటు ఏకంగా 14 శాతం తగ్గిందని ఆమె వెల్లడించారు.




## మూసీ ప్రాజెక్ట్‌లో ఇళ్లు కోల్పోయే వారికి గుడ్ న్యూస్

### మంత్రి పొంగులేటి కీలక ప్రకటన




## అస్సాంలో వరద బీభత్సం

### మునిగిపోయిన 100కు పైగా గ్రామాలు




అరుణాచల్ వర్షాల ప్రభావం

జోనాయ్‌లో తీవ్ర నష్టం

వేల ఎకరాల పంటలకు నష్టం

సహాయక చర్యలు ముమ్మరం

సీఎంతో అమిత్ షా ఫోన్‌లో చర్చ

## లాంఛనంగా అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం




ప్రథమ పూజతో యాత్ర ప్రారంభం

జూలై 3 నుంచి ఆగస్టు 28 వరకు

57 రోజులపాటు పవిత్ర యాత్ర

యాత్రకు పటిష్ట భద్రత

యాత్రా మార్గం 'నో-ఫ్లై జోన్'

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం



# 30 వేల డూప్లికేట్ ఓట్లు? ఈసీని ప్రశ్నించిన కవిత

మొదటి పేజీ తరువాయి




బోధన్‌లో 7 వేలు.. కొడంగల్‌లో 800 మాత్రమే ఎందుకు?

సర్ లో ఆశ్చర్యంగొల్పే విషయాలు వెలుగులోకి వచ్చాయని కవిత చెప్పారు. ఓట్ల ఏరివేతలో ఈసీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక మన దేశంలో ఎస్ఐఆర్ 8 సార్లు జరిగితే ప్రతి యేడాది ఎస్ఎస్ఆర్ జరుగుతుందని కవిత చెప్పారు. అయితే తెలంగాణలో 2026లో జరుగుతున్న ఎస్ఐఆర్ కు ప్రామాణికంగా 2026 జనవరి నాటి వివరాలు కాకుండా 2025 జనవరి నాటి ఎస్ఎస్ఆర్ జాబితాను తీసుకోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై తాము లోతుగా అధ్యయనం చేస్తే విస్తుగొల్పే విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఈ ఏడాదిన్న కాలంలో బోధన్ నియోజకవర్గంలో 7 వేల ఓట్లు తొలగించారని వాళ్లు షిఫ్ట్ అయ్యారా, చనిపోయారా? డూప్లికేషన్ ఓట్ల అనేది ఈసీ చెప్పటం లేదన్నారు. ఇదే సమయంలో సీఎం నియోజకవర్గం కొడంగల్?లో మాత్రం కేవలం 808 ఓట్లు మాత్రమే తొలగించారని బోధన్ లో 7 వేలు కొడంగల్ లో 808 మాత్రమే ఎందుకు తొలగించాలని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ మీద చాలా అనుమానాలు ఉన్నాయి. అన్నింటిపై ఈసీ క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రకాశ్ రాజ్ ఓట్లు తొగించేందుకు 7 ఏళ్లు:

సినిమా యాక్టర్ ప్రకాష్ రాజ్ కు మూడు రాష్ట్రాల్లో ఓటు ఉందని చెబుతున్నారు. ఆ ఓట్లను తొలగించేందుకు ఏడు ఏళ్లు పడితే భోదన్?లో మాత్రం ఏడాదిన్నరలో 7 వేల ఓట్లు తొలగించారని కవిత ధ్వజమెత్తారు. ఒక నియోజకవర్గంలో 2 శాతం కన్నా ఎక్కువ ఓట్లను తొలగించాల్సి వస్తే తొలిగించే ప్రతి ఓటరుకు మూడుసార్లు నోటీసులు ఇవ్వాలని ఈసీ నిబంధన ఉంది. కానీ ఆ విధంగా ఎవరికీ నోటీసు ఇవ్వలేదు. ఇస్తే ఈసీ దీని గురించి స్పష్టమైన సమాచారం ఇవ్వాలన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మన దేశంలో వేరే దేశంలో వాళ్లకు ఓట్లు ఉండవద్దని అంటున్నారు. దానికి మేము అంగీకరిస్తాం. కానీ ఒక రాష్ట్రంలో ఓటు ఉన్న వాళ్లకు మరొక రాష్ట్రంలో ఉండవచ్చా? మీరు ఒక రాష్ట్రంలో వేరే దేశ పౌరుడి ఓటు తొలగిస్తే వాళ్లు మరొక రాష్ట్రానికి వచ్చి నమోదు చేసుకోరా? అసలు ఇంటర్ స్టేట్ లో ఓట్ల డూప్లికేషన్ ను ఏరివేసేందుకు ఈసీ దగ్గర మెకనిజమే లేదు. అలాంటప్పుడు 14 వందల కోట్లు పెట్టి ఎస్ఐఆర్ చేయటం వల్ల ప్రయోజనం ఏంటీ? అని నిలదీశారు.

పక్క రాష్ట్రం ఓట్లపై..

ఈ ఎస్ఐఆర్ ద్వారా దేశంలో డూప్లికేషన్ ఓట్లు ఉండకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ నిర్వహించే పరిస్థితి రావాలన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్, వన్ ఓటు అనే పరిస్థితి ఉండాలన్నారు. కచ్చితంగా ఇంటర్ స్టేట్ మైగ్రేషన్, డూప్లికేషన్ అంశంపై దృష్టి పెట్టాలని అదే విధంగా దేశంలో ఉండే సంచార జాతుల వాళ్లకు ఏ విధంగా ఓటు ఇస్తారో చెప్పాలన్నారు. ఒక ఇంట్లో ఉండే వాళ్లందరికీ ఒకే బూత్ లో ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ద్వారా ఇంటర్ స్టేట్ డూప్లికేషన్ ఓట్లను కూడా కట్ చేయాలి. లేదంటే ఎస్ఐఆర్ కు అర్థం ఉండదని చెప్పారు. ఎస్ఐఆర్ అనేది పర్మినెంట్ సొల్యుషన్‌గా ఉండాలని మేము కోరుతున్నామన్నారు. మాలాంటి కొత్త పార్టీకి ఇది చాలా ఇంపార్టెంట్ అని కచ్చితంగా ఫెయిర్ గా ఎన్నికల జాబితా సిద్ధం చేయాలని ఈసీని కోరుతున్నామన్నారు. మేము లేవనెత్తిన ప్రశ్నలన్నింటికీ ఈసీ సమాధానం చెప్పాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాం.

# చివరి నిమిషంలో సీఎం సభ రద్దు



**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంగళవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగాల్సిన 'రైతు ఆశీర్వాద సభ' రద్దయింది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, రైతులకు పెట్టుబడి సాయం అందించే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయకుండా, ప్రత్యామ్నాయంగా హైదరాబాద్లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సభను 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, దీనికి సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని మంత్రులకు, ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

నేడు సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం..

శిల్పకళా వేదికలో రేపు సాయంత్రం 4 గంటలకు ఈ ప్రతిష్టాత్మక సమావేశం ప్రారంభం కానుంది. మధిర సభ రద్దయినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరినీ ఇందులో భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇందులో భాగంగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలోని రైతులు తమ పరిసర ప్రాంతాల్లోని 'రైతు వేదికల' నుంచీ డిజిటల్/వర్చువల్ పద్ధతిలో ఈ సమావేశంలో ప్రత్యక్షంగా పాల్గొనేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# అస్సాంలో వరద బీభత్సం

## మునిగిపోయిన 100కు పైగా గ్రామాలు



**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** అస్సాంకు పొరుగు రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న కుంభవృష్టి కారణంగా అస్సాంను వరదలు ముంచెత్తుతున్నాయి. ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులతో అస్సోం–అరుణాచల్ సరిహద్దు ప్రాంతమైన జోనాయ్ తీవ్ర నష్టాన్ని చవిచూస్తోంది. నదీ ప్రవాహాలు ఉగ్రరూపం దాల్చడంతో ఇప్పటివరకు 100కు పైగా గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. వందలాది ఎకరాల వ్యవసాయ భూములు, ఇళ్ళు, రోడ్లు, ఇతర ఆస్తులు జలమయమయ్యాయి. ఈ ఊహించని వరద ఉధృతికి పెద్ద సంఖ్యలో పశువులు నీటిలో కొట్టుకుపోయి మరణించినట్లు సమాచారం అందుతోంది.

బాహీర్ చిలే, బాహీర్ జోనాయ్ లపై తీవ్ర ప్రభావం..

ప్రస్తుత వరదల వల్ల బాహీర్ చిలే, బాహీర్ జోనాయ్ గ్రామ పంచాయతీలు అత్యంత ఘోరంగా దెబ్బతిన్నాయి. బాహీర్ చిలే పంచాయతీ పరిధిలోని సుమారు 40 గ్రామాలు, అలాగే బాహీర్ జోనాయ్ పంచాయతీ పరిధిలోని 60కి పైగా గ్రామాలు పూర్తిగా వరద గుప్పిట్లోకి వెళ్ళిపోయాయి. వేలాది మంది ప్రజలు ఇళ్లు కోల్పోయి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. సహాయక బృందాలు క్షేత్రస్థాయిలో చేరుకుని బాధితులను రక్షించేందుకు ముమ్మరంగా శ్రమిస్తున్నాయి. కాగా ఈ వరదలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. సీఎం హిమంత బిశ్వ శర్మతో మాట్లాడి, అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో నేరాల రేటు 14% తగ్గింది హోంమంత్రి అనిత

మొదటి పేజీ తరువాయి



'ఈగల్' టాస్క్‌ఫోర్స్ ఘనత

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని ఈ సందర్భంగా మంత్రి అనిత కొనియాడారు. ఈ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని పూర్తిగా ధ్వంసం చేశామని వివరించారు. కేవలం మత్తు పదార్థాలను పట్టుకోవడమే కాకుండా, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంతరాష్ట్ర స్మగ్లర్ల నడ్డి విరుస్తూ.. వారికి చెందిన రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని ఆమె హెచ్చరించారు.

# తమిళనాడులో కొనసాగుతున్న రాజీనామాల పర్వం మరో ఎమ్మెల్యే రాజీనామా



**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** తమిళనాడు రాజకీయాల్లో ఎమ్మెల్యేల రాజీనామా పర్వం కంటిన్యూ అవుతోంది. రాష్ట్రంలో టీవీకే నేతృత్వంలో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి ఇప్పటి వరకు ఐదుగురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేయగా తాజాగా అదే బాటలో మరో ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేశారు. ఏఐఏడీఎంకే పార్టీకి చెందిన కరూర్ ఎమ్మెల్యే, మాజీ రవాణా శాఖ మంత్రి ఎం.ఆర్. విజయ భాస్కర్ ఇవాళ రాజీనామా చేశారు. ఈ ఉదయం రాష్ట్ర సచివాలయంలో స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్‌ను కలిసిన విజయభాస్కర్.. తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు.

పళనిస్వామికి ఇబ్బందులు:

తాజా పరిణామాల నేపథ్యంలో ఏఐఏడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామికి ఇబ్బందులుతప్పడం లేదు. రెండు నెలల క్రితం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎఐఎడిఎంకే నుంచి ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు వైదొలుగుతుండటం సంచలనంగా మారింది. తొలుత విజయ్ ప్రభుత్వంపై విశ్వాస తీర్మానంలో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లో ఏకంగా 25 మంది టీవీకేకు సపోర్టు చేయగా అందులోని వారు క్రమంగా తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన వారంతా అధికార టీవీకేలో చేరగా విజయ భాస్కర్ కూడా అదే బాటలో పయనిస్తారని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది.

# రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మళ్లీ మల్లికార్జున ఖర్గే

**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** పార్లమెంట్ లోని రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా మళ్లీ మల్లికార్జున ఖర్గేను తిరిగి ఎన్నుకున్నారు. దీంతో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి రాజ్యసభ ప్రతిపక్ష నేతగా అధికారిక గుర్తింపు పొందారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన ఎగువ సభకు తిరిగి ఎన్నికైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు సోమవారం గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సమక్షంలో ఖర్గే సోమవారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు.

సాంకేతిక కారణాల వల్ల చిన్న విరామం..

ఖర్గే రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం జూన్ 25, 2026తో ముగిసింది. దీనివల్ల సాంకేతికంగా జూన్ 26, 2026 నుంచి ఆయన రాజ్యసభ ప్రతిపక్ష నేత పదవిని కోల్పోవాల్సి వచ్చింది. అయితే, ఆయన మళ్లీ సభకు ఎన్నిక కావడంతో, సోమవారం ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే రాజ్యసభ సెక్రటేరియట్ ఆయనను తిరిగి ప్రతిపక్ష నాయకుడిగా గుర్తిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. సభలో సీనియర్ నేతగా, అనుభవజ్ఞుడిగా ఉన్న ఖర్గే మళ్లీ అదే స్థానంలో బాధ్యతలు చేపట్టడంపై కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# మూసీ ప్రాజెక్ట్‌లో ఇళ్లు కోల్పోయే వారికి గుడ్ న్యూస్ మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మూసీ నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి సోమవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, స్టాంప్స్ ఢ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసీ నదిని పునరుజ్జీవింపజేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమని వివరించారు.

రాజీ పడే సమస్యే లేదు..

మూసీ నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసీ పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్టుగా మూసీ ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో ప్రజా కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని ఇందుకు అవసరమైన క కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదని మంత్రి స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ భయం పట్టుకుంది దమ్మంటే అసెంబ్లీ రద్దు చెయ్

మొదటి పేజీ తరువాయి

నీ ఆలోచనలే పొట్టి.. మా పనితీరులో మేం పొడుగు

"ఏమన్నా అంటే అరడుగులు ఉన్నావ్ అంటూ నా ఎత్తు గురించి, జగదీష్ రెడ్డి పొట్టిగా ఉన్నారంటూ సీఎం మాట్లాడుతున్నారు. మాకు ఆయనలాగా సంకుచిత మనసు, కుంచిత మనస్తత్వం లేవు. మా పనితీరులో మేం ఎప్పుడూ పొడుగే. కానీ సీఎం రేవంత్ రెడ్డి నీ మనసు పొట్టి, నీ ఆలోచనలు పొట్టి, నిజానికి నువ్వే పొట్టిగా ఉన్నావు" అని హరీష్ రావు ఘాటుగా విమర్శించారు. అధికార మదం, అహంకారంతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు త్వరలోనే ఉప్పు పాతర వేయడం ఖాయమని హెచ్చరించారు. ప్రతిపక్షాలను తిట్టడం పక్కనబెట్టి, ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై సీఎం దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# ప్రాణం తీసిన సర్ భయం జైలుకు పంపిస్తారేమోనని వ్యక్తి ఆత్మహత్య!




**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జాబితాలో తన పేరు లేదని, దాంతో తనను జైలుకు పంపుతారనే భయంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. బోరబండ ఏరియాలోని భరత్?నగర్ లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ ముజీబుర్ రహ్మాన్ (51) కార్ డ్రైవర్?గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే తన పేరు పాస్ పోర్టుతో పాటు పలు డాక్యుమెంట్లలో తప్పుగా పడటంతో వాటిని సరి చేసుకోవడానికే ఇప్పటికే లక్షల్లో ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఎస్ఐఆర్ జాబితాలో తన పేరు లేదని తన వద్ద ఉన్న పత్రాలు ఎస్ఐఆర్?కు సరిపోలవని మనస్తాపం చెందిన ముజీబుర్ భయపడిపోయాడు.

జైలుకు పంపుతారేనని:

ఎస్ఐఆర్ లో పేరు లేకపోతే తనను జైలుకు పంపుతారని అప్పుడు తన ముగ్గురు పిల్లలను ఎవరు చూసుకుంటారని తన భార్య వద్ద పలు నిత్యం బాధపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంలో భార్య ఎంత ధైర్యం చెప్పినా అతడిలోని భయం తొలిగిపోలేదని ఈ క్రమంలో చివరకు ఇంటి బయట ఉన్న షెడ్డు ఇరుమ రాడ్డుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. కుటుంబ సభ్యులు చెబుతున్నట్లు నిజంగానే ఎస్ఐఆర్?లో ముజీబుర్ పేరు లేదా? ఆ కారణం వల్లే అతడు బలవన్మరణానికి పాల్పడ్డాడా? అతడి మరణానికి దారి తీసిన పరిస్థితులేంటి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# మహాలక్ష్మితో మారిన ఆర్టీసీ దశ..కాసుల వర్షంలో టీజీఎస్ఆర్టీసీ

మొదటి పేజీ తరువాయి




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ మొత్తం ఖర్చులు రూ.8,520.6 కోట్లుగా ఉండవచ్చని అంచనా వేయగా.. రాబడి రూ.9,639.5 కోట్లకు చేరుకుంటుందని ప్రణాళికలు సిద్ధం చేసింది. గడచిన దశాబ్ద కాలంలో సంస్థ ఆదాయం స్థిరంగా పెరుగుతూ వచ్చింది. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత 2014–15లో కేవలం రూ.3,294 కోట్లుగా ఉన్న టీజీఎస్ఆర్టీసీ ఆదాయం.. 2025–26 నాటికి రికార్డు స్థాయిలో రూ.9,374.18 కోట్లకు చేరటం సంస్థ సాధించిన ప్రగతికి నిదర్శనమని అధికారులు చెబుతున్నారు.

సంస్థ సాధించిన ఈ విజయంపై టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి స్పందిస్తూ.. డిసెంబర్ 2023లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం సంస్థ పునరుజ్జీవనానికి ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య ఊహించని విధంగా పెరిగిందని చెప్పారు. గతంలో బస్సుల ఆక్యుపెన్సీ రేషియో కేవలం 67 శాతంగా ఉండేదని.. అది కాస్తా ఇప్పుడు ఏకంగా 98 శాతానికి పెరిగిందని ఆయన వివరించారు.

దీనికితోడు ప్రయాణికుల ఛార్జీలలో చేసిన కొన్ని వ్యూహాత్మక సవరణలు కూడా సంస్థ ఆదాయాన్ని పెంచాయని ఎండీ తెలిపారు. టోల్ ఛార్జీలు, సేఫ్టీ సెస్, రౌండ్–అప్ ఛార్జీల సవరణ ద్వారా అదనపు రాబడి సమకూరినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రయాణికుల ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ టీజీఎస్ఆర్టీసీ తన లాభాల పరంపరను విజయవంతంగా కొనసాగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిరంతర నష్టాలతో ప్రభుత్వ సహాయంపై ఆధారపడిన ఆర్టీసీ.. ఇప్పుడు స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# లాంఛనంగా అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం హెలికాప్టర్ సేవలు బంద్!



**న్యూస్ డెస్క్, 29 జూన్ (ఇది కద నిజం):** ప్రతిష్టాత్మక శ్రీ అమర్‌నాథ్ జీ యాత్ర–2026 లాంఛనంగా ప్రారంభమైంది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సోమవారం పవిత్ర గుహాలయంలో మంచు లింగానికి శాస్త్రోక్తంగా 'ప్రథమ పూజ' నిర్వహించి యాత్రకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబా బర్ఫానీ ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి, శ్రేయస్సులతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

యాత్రకు సంబంధించిన ముఖ్య వివరాలు...

యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 28 (శ్రావణ పౌర్ణమి, రక్షా బంధన్) వరకు మొత్తం 57 రోజుల పాటు కొనసాగుతుంది. యాత్రికులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచేలా స్థానిక యంత్రాంగం, ఆర్మీ, భద్రతా దళాలు, పుణ్యక్షేత్రాల బోర్డు సమన్వయంతో మౌలిక సదుపాయాలు సహా పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశారు. కశ్మీర్ హిమాలయాల్లోని అనంతనాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి 3,880 అడుగుల ఎత్తులో ఉన్న ఈ గుహకు ప్రధానంగా రెండు మార్గాలు ఉన్నాయి. సంప్రదాయ పహల్గామ్ మార్గం ద్వారా వెళితే 4 రోజులు పడుతుంది. అదే బల్తాల్ బేస్ క్యాంప్ నుంచి వెళ్తే ఒకే రోజులో దర్శనం చేసుకుని తిరిగి రావచ్చు.

గమనిక.. 'నో–ఫ్లై జోన్'గా యాత్రా మార్గం

ఈ ఏడాది యాత్రలో అధికారులు కీలక మార్పు చేశారు. బేస్ క్యాంపులైన పహల్గామ్, బల్తాల్ నుంచి పవిత్ర గుహకు వెళ్లే మార్గాన్ని 'నో–ఫ్లై జోన్'గా ప్రకటించారు. దీని కారణంగా ఈసారి భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండనట్లు తెలుస్తోంది. యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

Registered No : APTEL/25/A0818
# ఇది కద నిజం
మంగళవారం 30-06-2026

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి: మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం



ఇది కద నిజం,నవాబ్‌పేట్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు ప్రగతి పథంలో దూసుకుపోతాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక సహకారంతో, చిట్టిగిద్ద గ్రామానికి మంజూరైన రూ. 15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సి.సి. రోడ్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ శ్రీధర్ రావు, మండల అధ్యక్షుడు చంద్రకాంత్, బీజేపీ స్థానిక నాయకులతో కలిసి ఆయన ఈ రోడ్లను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా కె.ఎస్. రత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో మండల కేంద్రాల నుంచి మొదలుకొని మారుమూల గ్రామాల వరకు అన్ని ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినందుకు గాను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఈ సందర్భంగా గ్రామస్థులు, స్థానిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఐటీ సెల్ ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, దళిత మోర్చా మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్, పార్టీ నాయకులు మణికంఠ, నర్సింహులు, పద్మారావు, వందేమాతరం, ప్రశాంత్, గోపాల్, శేఖర్‌లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## త్వరలో గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర

### తెలంగాణ పల్లె పల్లెకు రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ




ఇది కద నిజం:తెలంగాణ ప్రజల్లో గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని నింపే లక్ష్యంతో గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర రాష్ట్రంలోని ప్రతి పల్లెకు కొనసాగుతుందని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యం, రైతు స్వరాజ్యం, యువ స్వరాజ్యం, మహిళా స్వరాజ్యం, కార్మిక స్వరాజ్యం సాధించి, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ మహా యాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ యాత్రలో ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ, ప్రతి వ్యక్తిని ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, ఆశయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ ప్రజల భాగస్వామ్యంతో ఒక కొత్త తెలంగాణ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. "తెలంగాణ అభివృద్ధి ఫలితాలు చివరి వ్యక్తికి చేరాలంటే గ్రామ స్వరాజ్యమే శాశ్వత పరిష్కారం. గ్రామం బలపడితే రాష్ట్రం బలపడుతుంది. ప్రజలే పాలనలో భాగస్వాములు కావాలి" అని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల ఆత్మగౌరవం, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళల సాధికారత, కార్మికుల అభ్యున్నతి లక్ష్యంగా సాగుతున్న ఈ మహా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ పిలుపునిచ్చారు.

## ఎంపీ సానా సతీష్ కు ఎమ్మెల్యే బండారు ఘన స్వాగతం...



కొత్తపేట(ఇది కద నిజం)జూన్ 29: రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై తొలిసారిగా జిల్లా పర్యటనకు వచ్చిన ఎంపీ సానా సతీష్ కు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సానా సతీష్ కు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. కొత్తపేట వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట బస్టాండ్ సెంటర్ లో ఉన్న, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్, అన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీ సానా సతీష్, కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.పార్టీ శ్రేణులు ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావుకు ఘన వీడ్కోలు



అమరావతి (ఇది కద నిజం)జూన్ 29: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు సోమవారం పదవీ విరమణ చేశారు. రాజ్యాంగ విలువలు, వాటి మౌలిక స్వరూపాన్ని పరిరక్షించే దిశగా అనేక చారిత్రాత్మక తీర్పులు వెలువరించిన న్యాయమూర్తిగా ఆయనకు విశిష్ట గుర్తింపు ఉందని పలువురు న్యాయవాదులు కొనియాడారు. న్యాయమాత గర్వించదగ్గ ఎన్నో తీర్పులను అందించిన ఆయన సేవలు ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

సోమవారం జరిగిన పదవీ విరమణ సందర్భంగా జె.ఎన్. టి. యి స్టాండింగ్ కౌన్సిల్ రామ్ మరియు హైకోర్టు న్యాయవాది ఎం. వి. సుబ్బారావు జస్టిస్ రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనకు వీడ్కోలు పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలు, ఆనందాలతో నిండాలని ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి-జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరు జిల్లా గూడూరు (ఇది కద నిజం):- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిల్లకూరు మండలం, పొన్నపరవారిపాలెం లో పర్యటించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.

జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా సోమవారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎస్పి అజిత వేజెండ్ల, జేసి మొగిలి వెంకటేశ్వర్లు..లతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం




ఇది కద నిజం: నెల్లూరు జిల్లా లో పున్నపువారిపాలెం, ఓడూరు, రెట్టపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు నూతన సర్వీసును గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం సునీల్ కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, డిఆర్డీఏ, మెప్మా పిడీలు నాగరాజ కుమారి, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, పౌర సరఫరాల శాఖ డీఎం అర్జున రావు, డిఎస్ఓ పుల్లయ్య, డీఎస్పీ గిరిధర్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా

### ఆత్రేయపురం మండలానికి చెందిన 87మందికి రూ.47,73,853ల విలువైన చెక్కులను పంపిణీ



ఆత్రేయపురం(ఇది కద నిజం)జూన్ 29: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. ఆత్రేయపురంలో సోమవారం వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్)స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఆత్రేయపురం మండలానికి చెందిన 87మందికి రూ.47,73,853ల విలువైన సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ, ఇన్సూరెన్స్ కవర్ కాని వారికి ఆసుపత్రి ఖర్చులో కొంతభాగాన్ని అందిస్తూ.. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి కష్టకాలంలో ప్రభుత్వం తోడుగా నిలుస్తోందని తెలిపారు.

## అనకాపల్లిలో పెండెం దొరబాబుకు జనసేన శ్రేణుల ఘన స్వాగతం

### పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు, జనసైనికులు, వీర మహిళలు



అనకాపల్లి: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులుగా నియమితులైన పెండెం దొరబాబు తొలిసారిగా అనకాపల్లి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.

పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆదేశాల మేరకు నామవరం పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అనిశెట్టి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవవరపు రఘు, జిల్లా కార్యదర్శి పల్లి దుర్గారావు, సీతారామపురం సర్పంచ్ పక్కుర్తి కృష్ణ, నాలుగు మండలాల అధ్యక్షులు యగదాసు నానాజీ, వెలగా సుధాకర్, పప్పల శివ, సింగంపల్లి శ్రీను, పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, రాష్ట్ర మత్స్యకార విభాగ కార్యదర్శి సంజీవ్, జగన్నదొర, నక్కపల్లి మండల ఉపాధ్యక్షుడు నల్లల రత్నాజీ, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్, దాసరి భాస్కర్, ఖిశెట్టి రమణ, దేవవరపు శివరాజు, పాల్తేరు ఎంపీటీసీ మాకినీడు చిట్టిబాబు, సర్పంచ్ పి. కృష్ణ, హరికృష్ణ, తుమ్మల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం సమష్టిగా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో జనసేనను మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## విద్యా సేవలకు ముగింపు -- ఉపాధ్యాయురాలు జయకుమారికి ఘన వీడ్కోలు



అనేక పాఠశాలల్లో సేవలు... విద్యార్థుల అభివృద్ధికి అంకితభావం... పదవీ విరమణ సందర్భంగా సన్మానం

నందిగాం మండల విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయురాలు శ్రీమతి గురుబెల్లి జయకుమారి పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణను అందిస్తూ ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఆమె సేవలను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు కొనియాడుతున్నారు.

జయకుమారి తన ఉపాధ్యాయ సేవలను కయ్‌జోల ఎలిమెంటరీ పాఠశాలలో తొలి పోస్టింగ్‌తో ప్రారంభించారు. అనంతరం టెక్కలి మండలంలోని పోలవరం, టెక్కలి, పెద్దలౌనిపల్లి, తురకలకోట, పెద్దబాణాపురం గ్రామాల్లో విధులు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా నిలిచారు.

సేవా కాలమంతా విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణమే లక్ష్యంగా పని చేసిన ఆమెకు స్థానిక ప్రజలు, పూర్వ విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు. ఆమె పదవీ విరమణ సందర్భంగా నిర్వహిస్తున్న ఉదకశాంతి కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచరులు, పూర్వ విద్యార్థులు హాజరై ఆశీర్వదించాలని పెయ్యాల కృష్ణారావు కుటుంబ సభ్యులు కోరారు.

"ఉపాధ్యాయ సేవ ముగిసినా... విద్యా వెలుగు కొనసాగాలి" అనే సందేశంతో జయకుమారి గారి సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు.

## ఎమ్మెల్యే పంతం నానాజీపై ఫిర్యాదు..!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా జూన్ 29: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, వెంకటేశ్వరరావు ఇటీవల మాటామంతి ప్రెస్ మీట్‌లో మా ప్రియతమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమైన, అసభ్యకరమైన మరియు విద్వేషపూరిత, వ్యాఖ్యలగాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ లబ్ధి కోసం, ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే విధంగా మాట్లాడిన పంతం నానాజీ వైఖరికి నిరసనగా నేడు వైఎస్ఆర్ కడపజిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తెలుగుపులి వెంకటసుబ్బమ్మ, మాజీ కార్పొరేటర్లు షఫీ, బసవరాజు, త్యాగరాజు, కడప నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు కంచుపాటి బాబు, సీనియర్ నాయకులు వినోద్ కుమార్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు సాయి దత్త, గల్ఫ్ కన్వీనర్ బిహెచ్ఇయస్, మరియు ఇతర వైసిపి ముఖ్య నాయకులు కలిసి కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదుతో కంప్లైంట్ అందజేయడం జరిగింది. భారతీయ న్యాయ సంహిత ఇది కద నిజం 2023 సెక్షన్ ప్రకారం ఆయనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన.. కడపజిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగుపల్లి వెంకటసుబ్బమ్మ, పంతం నానాజీ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## సత్యవరంలో బూత్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకుల పాల్గొన్నరు



అనకాపల్లి జిల్లా,జూన్ 29 పాయకరావుపేట : మండలంలోని సత్యవరం గ్రామంలో బూత్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని వైఎస్సార్సీపీ నాయకులు నిర్వహించారు.ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి కంబాల జోగులు,వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, మండల అధ్యక్షుడు గెద్దమూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ బూత్ అధ్యక్షుడు చిక్కాల సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఎంపీటీసీలు తమ్మిరెడ్డి సత్యనారాయణ, యాగదాసు శేఖర్,గ్రామశాఖ అధ్యక్షులు కర్రి వీరబాబు, సఖిలేటి దొరబాబు, పడాల మోహన్రావు, ఉప్పాడ సత్తిబాబు, బీఎల్ వోలు,బీఎల్ఎలు తదితరులు పాల్గొని ఓటరు జాబితా పరిశీలనలో భాగస్వాములయ్యారు.

## ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నాకు వార్నింగ్



చింతపల్లి ఇది కద నిజం న్యూస్:-29 జూన్: బాక్సైట్ తవ్వకాలు, హైడ్రో పవర్ ప్రాజెక్టులు, జీవో నంబర్-3, గిరిజన భూ బదలాయింపు నియంత్రణ చట్టం 1/70 వంటి కీలక అంశాలపై గిరిజన ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తి పోరాడాలని, లేనిపక్షంలో గిరిజనులు ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నాలకు సిద్ధమవుతారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు.

శనివారం చింతపల్లిలో నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జీకే వీధి మండలంలోని జెర్రీల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన క్రిటికల్ మినరల్ ట్రాకర్స్ సంస్థ ప్రతినిధులు బాక్సైట్ నమూనాల సేకరణకు వచ్చిన విషయం తెలిసిందేనన్నారు. బాక్సైట్ తవ్వకాల ఒప్పందం 30 సంవత్సరాల కాలపరిమితితో కొనసాగుతున్నట్లు పత్రాల్లో ఉందని, ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు, ఆదివాసీ సంఘాలు, గిరిజనులు గుర్తించాలని కోరారు.

ఈ సమావేశంలో సీపీఎం చింతపల్లి, జీకే వీధి మండల కార్యదర్శులు పాంగి ధనుంజయ్, అంపురంగి బుజ్జిబాబు, పాంగి బాలయ్య, అమ్మవారి దారకొండ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ మురళి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్




## 'ఇరుముడి కట్టు' సాంగ్ వచ్చేసింది

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా నుంచి తొలి పాట 'ఇరుముడి కట్టు'ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు ఈ భక్తి గీతం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. జి.వి. ప్రకాష్ కుమార్ స్వరపరిచిన 'ఇరుముడి కట్టు' పాట అయ్యప్ప స్వామి భక్తి, మండల దీక్ష, శబరిమల యాత్ర నేపథ్యాన్ని ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ఆవిష్కరించింది.

ఈ పాటకు దర్శకుడు శివ నిర్వాణ, కళ్యాణ్ చక్రవర్తి కలిసి సాహిత్యం అందించగా, అనంతు తన గాత్రంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పాటలో అయ్యప్ప మాల ధరించిన భక్తుడి పాత్రలో రవితేజ లుక్, హావభావాలు ఆకట్టుకుంటాయి. అలాగే ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర కనిపించే భావోద్వేగ సన్నివేశాలు పాటకు మరింత బలాన్ని చేకూర్చాయి. బాబా భాస్కర్ కొరియోగ్రఫీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొంతకాలంగా రవితేజ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలను అందుకోలేకపోయాయి. అయితే ఈసారి ఆయన తొలిసారిగా భక్తి ప్రధాన కథాంశంతో కూడిన చిత్రంలో నటిస్తుండటం, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, తొలి పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో 'ఇరుముడి'పై అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ చిత్రంతో రవితేజ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంటారో లేదో చూడాలి.

## పాట పడబోతున్న సూర్య



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కరుప్పు సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు. ఆ సినిమా ఇచ్చిన జోష్ తో ఇప్పుడు తన అభిమానులకు ఒక ఊహించని సర్ప్రైజ్ ఇచ్చేందుకు రెడీ అయ్యాడు. తన నెక్స్ట్ మూవీ కోసం సూర్య మైక్ పట్టుకున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'విశ్వనాథ్ అండ్ సన్స్' కోసం సూర్య ఒక అదిరిపోయే డాన్స్ నంబర్‌ను పాడారు.

ఈ స్పెషల్ డాన్స్ నంబర్‌ను ఇటీవల వచ్చిన యూత్ సినిమా యాక్టర్ కమ్ డైరెక్టర్ కెన్ కరుణాస్ స్వయంగా రచించడం విశేషం. సూర్య మార్క్ ఎనర్జీకి తోడు, కెన్ కరుణాస్ అందించిన క్యాచీ లిరిక్స్, వెంకీ అట్లూరి మేకింగ్ స్టైల్ కలసి ఈ పాటను ఆల్బమ్‌లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. సాధారణంగానే సూర్య డాన్స్ నంబర్లకు థియేటర్లలో రెస్పాన్స్ భారీగా ఉంటుంది అలాంటిది ఈ పాటను స్వయంగా సూర్య పాడటంతో ఏ రేంజ్ లో వుండబోతుందోనని ఎదురుచూస్తున్నారు. సూర్య వాయిస్‌లో రాబోతున్న ఈ మాస్ డాన్స్ నంబర్ ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని ఆడియన్స్ తో పాటు ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వరుస సక్సెస్‌ల తర్వాత వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో వస్తున్న సినిమా కావడం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లిమ్స్, సాంగ్స్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేశాయి.






## ఓటీటీలోకి పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా మరికొన్ని రోజుల్లో ఓటీటీలోకి రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సంస్థ దక్కించుకుంది. అందులో భాగంగా జూలై 2 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం ఓటీటీలో ఎలాంటి ఆదరణను దక్కించుకుంటుందో చూడాలి. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట్ సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు. అలాగే జగపతి బాబు, శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు.

## దర్శకుడిగా రామ్ పాతినేని కొత్త ప్రయాణం

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన సినీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం 'RAPO23' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాగా నిలవనుంది. ఈ సినిమాతో రామ్ కేవలం హీరోగానే కాకుండా దర్శకుడిగా కూడా కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టడం విశేషం. ఇప్పటివరకు నటుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఈసారి మెగా ఫోన్ పట్టి దర్శకుడిగా కూడా తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ స్టోరీని కూడా స్వయంగా రామ్ రాసినట్లు చిత్ర బృందం ప్రకటించింది.

సోమవారం హైదరాబాద్‌లో సంప్రదాయబద్ధంగా 'RAPO23' పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నిర్మాత కృష్ణ పోతినేని స్క్రిప్ట్‌ను రామ్‌కు అందజేయగా, సీనియర్ నటుడు మురళీమోహన్ ముహూర్తపు షాట్‌కు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ నిర్మాత పీవీ రవికిశోర్ క్లాప్ కొట్టగా, తొలి షాట్‌కు స్వయంగా రామ్ దర్శకత్వం వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైంది. రామ్‌తో పాటు ప్రధాన తారాగణం ఇప్పటికే సెట్స్‌లో జాయిన్ అయినట్లు సమాచారం. 'RAPO23' చిత్రాన్ని సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. నియో నోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో రామ్ ఇప్పటివరకు కనిపించని కొత్త అవతార్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. కథ, పాత్ర, ట్రీట్‌మెంట్ అన్ని పరంగా ఈ సినిమా రామ్ కెరీర్‌లో అత్యంత విభిన్న చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ చిత్రాన్ని కృష్ణ పోతినేని నూతనంగా స్థాపించిన 'రాపో సినిమాటిక్స్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. నిర్మాణ విలువలు, సాంకేతిక నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సినిమాను రూపొందించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత సినిమాటోగ్రాఫర్ తిరు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలను ప్రముఖ ఫైట్ మాస్టర్ పీటర్ హైన్ నిర్వహిస్తుండగా, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. ఈ సాంకేతిక బృందం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నివేతా పేతురాజ్ నటించే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్ నగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే చిత్ర బృందం ఇంకా పూర్తి తారాగణాన్ని అధికారికంగా ప్రకటించలేదు. త్వరలోనే నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

## వెంకటేశ్ అలా.. కల్యాణ్‌రామ్ ఇలా..



అగ్ర హీరోలు వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో అనిల్ రావిపూడి నిర్మిస్తున్న మల్టీస్టారర్ మూవీ ఈ నెల 22న లాంఛనంగా మొదలైన విషయం తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ని అనిల్ రావిపూడి స్టార్ట్ చేయనున్నారు. దీనికోసం ఇప్పటికే హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో భారీ సెట్‌ను కూడా నిర్మిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్‌రామ్‌లపై కామెడీ సీన్స్‌తో పాటు ఓ పాటను కూడా షూట్ చేస్తారట. అంతేకాక, ప్రధాన తారాగణమంతా పాల్గొనగా కథలోని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లోనే చిత్రీకరిస్తారని వినికిడి.

ఈ సినిమాలో వెంకటేష్ అల్ట్రా స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారట. ఆ లుక్‌కి పూర్తి భిన్నంగా కల్యాణ్‌రామ్ లుక్ ఉంటుందని సమాచారం. కుటుంబ భావోద్వేగాలు, కామెడీ ఎలిమెంట్స్ మేళవింపుగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. నవంబర్‌లోపు షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తి చేసి సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయాలని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'జనవరి 13న విడుదల'అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీత దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మాత.